సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అలరించిన కోలాటం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున సుప్రభాత, తోమాల సేవ అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించారు. సాయంత్రం కోలాటాలు, అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి.

గీతం పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

కొమ్మాది: హోం కమింగ్ పేరిట గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రెండు రోజుల పాటు నిర్వహించనున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శనివారం గీతం అధ్యక్షుడు ఎమ్. శ్రీ భరత్ ప్రారంభించారు. దేశ విదేశాల్లో నివాసం ఉంటున్న గీతం పూర్వ విద్యార్థులు ఈ ఉత్సవాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో గీతం కార్యదర్శి ఎమ్. భరద్వాజ్, వైస్ చాన్స్‌లర్ ప్రొ. దయానంద సిద్దవట్టం తదితరులు పాల్గొన్నారు.

బీమా పరిహారం పంపిణీ


పరిహారం పంపిణీ చేస్తున్న సచివాలయ కార్యదర్శులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస 78వ వార్డు సచివాలయం పరిధిలో బుద్దమ్మ అనే మహిళలకు వైఎస్సార్ బీమా మొత్తాన్ని మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, సచివాలయ కార్యదర్శులు అందజేశారు. శనివారం కాలనీలో సదరు నామిని ఇంటికి వెళ్లి దహన సంస్కారాలు నిమిత్తం రు. 10వేలు అందజేశారు. మిగిలిన మొత్తం కూడా త్వరలో అందజేస్తామన్నారు. ఇక్కడ తుపాను కాలంలో కూర్మారావు అనే వ్యక్తి కాలు జారి పడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందడంతో బీమా పరిహారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సచివాలయ కన్వీనర్ జీవీఎస్ రెడ్డి, పలువురు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సందడే సందడి


విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

తగరపువలస: భీమిలి మండలం శింగనబంధ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మూడు రోజుల పాటు జరిగిన 15వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ముగిశాయి. ముఖ్య అతిథులుగా ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్, అవినీతి నిరోధకశాఖ ఎస్పీ మురళి రంభ ఈ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. భారతీయ సంస్కృతికి సంబంధించిన అనేక విషయాలను విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా కనపరిచారన్నారు. ప్రిన్సిపాల్ భమిడిపాటి శైలా మాట్లాడారు. మహాభారతం, దశావతారం, కూచిపూడి ప్రదర్శనలు, జానపద కళారూపాలు ఆకట్టుకున్నాయి.

పాము కాటుతో గీత కార్మికుడి మృతి


మృతి చెందిన తాతయ్యలు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారానికి చెందిన గీత కార్మికుడు చుక్కా తాతయ్యలు పాము కాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం శుక్రవారం సాయంత్రం కల్లు గీసేందుకు ఆనందపురం మండలం పెద్దిపాలెంలో తాటి చెట్టు ఎక్కాడు. చెట్టు దిగిన తరువాత కాలుపై పాము కాటు వేయడంతో తాతయ్యలు అక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. ఇది గమనించిన పలువురు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

తల్లిదండ్రుల సమావేశం

తగరపువలస: భీమిలి జోన్ ఒకటోవార్డు సంతపేట అంబేడ్కరు జీవీఎంసీ హైస్కూల్‌లో శనివారం ప్రధానోపాధ్యాయుడు వై.జగన్నాథస్వామి ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు మూడు మాసాలు గడువు ఉన్నందున ఇంటి వద్ద తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు.

అభివృద్ధి 'జాతర'



- నూతన శోభతో **అలరారుతున్న** శిల్పారామం
- పెరిగిన సందర్శకుల తాకిడి
- ప్రత్యేక ఆకర్షణగా స్విమ్మింగ్ పూల్

పీఎంపాలెం: గత టీడీపీ పాలనలో కనీస అభివృద్ధికి నోచుకోని శిల్పారామం (జాతర)..వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సందర్శకులను విశేషంగా అలరిస్తోంది. సరికొత్త అందాలతో పర్యాటకులను ఫిదా చేస్తోంది. సుమారు 27 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన శిల్పారామంలో జీవకళ ఉట్టిపడే శిల్పాలు ఎన్నో ఉన్నాయి. వాటి అన్నిటికీ **రంగులు వేయించడంతో సరికొత్త**గా తీర్చిదిద్దారు. **వేలాది చదరపు అడుగుల విస్తీర్ణం**లో ఇటీవల గ్రీన్ కార్పెట్ తలపించే లాన్ ఏర్పాటు చేయడం అదనపు ఆకర్షణగా మారింది. ఉదయం వేళ వాకర్స్ కోసం శిల్పారామంలో ఉన్న అంతర రహదారులను వెడల్పు చేశారు. సీనియర్ సిటిజన్ల కోసం కొత్తగా ఓపెన్ జిమ్ నిర్మించారు. యోగాశాలను ప్రత్యేకంగా నిర్మించారు. పిల్లలు ఆటలాడుకోడానికి మరిన్ని సదుపాయాలు కల్పించారు. స్థాకంగా ఉన్న ఈత కొలను మరో ప్రత్యేక ఆకర్షణ. సందర్శకులు కూడా గతంలో కంటే అధిక సంఖ్యలో వచ్చి సేద తీరుతున్నారు. అలాగే క్రమంతప్పకుండా ప్రతి ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


శిల్పారామం ముఖద్వారం


ఓపెన్ జిమ్‌లో సీనియర్ సిటిజన్లు


ఈత కొలనులో సందర్శకుల కేరింతలు


పిల్లలు ఆడుకునే పరికరాలు


నూతి గట్టుపై పల్లె పడుచుల సజీవ శిల్పాలు


యోగా శాల

నాడు పూజ్యం... నేడు అభివృద్ధి



శిల్పారామం నిర్మించిన తరువాత ఇంతగా అభివృద్ధి పనులు ఏనాడూ చేపట్ట లేదు. గతంలో ఓపెన్ జిమ్ ఉండేదికాదు. యోగా కోసం ప్రత్యేక నిర్మాణం లేదు. ఈ రెండూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సారథ్యంలో అందుబాటులోకి వచ్చాయి. ఓపెన్ జిమ్ సీనియర్ సిటిజన్ల వ్యాయామానికి ఎంతో అనువుగా ఉంది.

–తెర్లి నారాయణ స్వామి, విశ్రాంత జెడ్పీ సూపరెంటిండెంట్ మధురవాడ

రూపురేఖలు మారిపోయాయి



గతలో శిల్పారామానికి రావడానికి సందర్శకులు అంతగా ఆసక్తి కనబరిచే వారు కాదు. వచ్చిన వారు కూర్చోడానికి తగినన్ని బెంచీలు ఉండేవికావు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. శాశ్వత సిమెంట్ పొడవు బల్లలను ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడు కోడానికి పలు ఉపకరణాలు ఏర్పాటు చేశారు.

– ఎం. శేషగిరిరావు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్త, పీఎంపాలెం

మంచినీటి పథకాల తనిఖీ


బాకురుపాలెం జగనన్న లే అవుట్‌లో కుళాయి నీటిని పరిశీలిస్తున్న అధికారులు

ఆనందపురం : మండలంలోని వివిధ గ్రామాల్లోని జగనన్న కాలనీలో ఏర్పాటు చేస్తున్న మంచినీటి పథకాలు, ఇంటింటి కుళాయిలను శనివారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. మండలంలోని అన్ని జగనన్న కాలనీల్లో తాగునీటి సౌకర్యం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు ఇంటింటికీ కుళాయిలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు క్వాలిటీ కంట్రోల్ విభాగం డీఈఈ ఎం.తిరుపతి నాయుడు, థర్డ్ పార్టీ పరిశీలకుడు బీఎస్ వెంకటరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ కేవీ శివనాథ్ కుమార్, గిడిజాల, శొంఠ్యాం, వెల్లంకి, బాకురుపాలెం జగనన్న కాలనీలను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను పరిశీలించారు. కుళాయిలు ద్వారా సరఫరా అవుతున్న మంచినీటి శాంపిల్స్‌ను సేకరించారు. ఈ సందర్భంగా తిరుపతి నాయుడు మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన కుళాయిలు ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి శాంపిల్స్‌ను సేకరిస్తున్నారని వాటిని ల్యాబ్‌లో పరీక్షించి తాగడానికి అనువైనవో కాదో గుర్తిస్తామన్నారు. మురుగునీటి వలన తాగునీరు కలుషితం కాకుండా పైపు లైన్లు వేయాలని ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి సూచించారు. అనంతరం మండలంలోని బోని గోస్తనీ వాటర్ వర్క్స్ నుంచి గంభీరంలో ఉన్న ఐఐఎం విద్యా సంస్థకు తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేస్తున్న పైపు లైనును బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ దుర్గాంబ, క్వాలిటీ కంట్రోల్ జేఈ కార్తిక్, జేఈ ఎస్ఎస్ఆర్ మూర్తి పాల్గొన్నారు.

24న వెలమ సంఘం వన సమారాధన

మధురవాడ: భీమిలి నియోజకవర్గం పరిధిలోని వెలమ కుటుంబాలతో ఈ నెల 24వ తేదీన మధురవాడ శిల్పారామం (జాతర)లో వన సమారాధన నిర్వహిస్తున్నట్టు గ్రేటర్ విశాఖ వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు చలుమూరి నాయుడుబాబు చెప్పారు. శనివారం మదురవాడ ఐటీ సెజ్ జంక్షన్‌లోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని వెలమ కుటుంబ సభ్యులు అంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. ఉత్తరాంధ్రాకి చెందిన వెలమ సంఘాల పెద్దలు, ప్రజా ప్రతినిధులు, ఇతర రంగాల ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారు పీఎస్ నాయుడు, సంఘ ప్రధాన కార్యదర్శి దొగ్గ దుర్గాప్రసాద్, కోశాధికారి సిరపరపు గౌరీశంకర్, ఉపాధ్యక్షుడు సూరెడ్డి సత్యనారాయణ, ద్వారపురెడ్డి కృష్ణ, యూత్ ప్రెసిడెంట్ దొగ్గ గణేష్, పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం


తాళ్లవలస గ్రామ సచివాలయం వద్ద మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: రాష్ట్రంలో సంక్షేమ పథకాల్లో సరికొత్త ఒరవడిని సృష్టించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టులో శనివారం నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ముత్తంశెట్టి పాల్గొన్నారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి ఉపయోగపడేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని, లక్షలాది మందికి సొంతింటి కల సాకారం చేసిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయేనన్నారు. నాడు-నేడు ద్వారా ఆస్పత్రులు, పాఠశాలలు కార్పొరేటు స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మోసం చేసిన, చేస్తున్న టీడీపీకి ఓటు వేస్తారో, మనసున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేస్తారో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. మొత్తం ఈ సచివాలయ పరిధిలో వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు రూ.4 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. గత పాలనలో రుణమాఫీ జరిగిందా... సున్నా వడ్డీ ఇచ్చారా... ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఎవరైనా లబ్ధి చేకూరిందా... అని ప్రజలను ప్రశ్నించగా ఎవరు లేదని బదులిచ్చారు. గత ప్రభుత్వంలో జన్మభూమి పేరుతో దోచుకున్నది ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, వివిధ విభాగాల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు పాలరవణారెడ్డి, బోర రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి, మేరుగు చిన్నారావు, కోడిబోయిన వరహాలు, వాండ్రాసి సన్యాసిరావు, వేముల ఈశ్వర్‌రెడ్డి, అప్పలరాజు, మరుపల్లి చిన్నారు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకూ వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివక్షకు తావులేకుండా టీడీపీ వారికి కూడా సంక్షేమ పథకాలు అమలు చేసి పెద్ద మనసు చాటుకున్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం భీమిలి మండలం తాళ్లవలస, టి.నగరపాలెం పంచాయితీలలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ పాలనలో చంద్రబాబు మహిళలకు రుణమాఫీ, సున్నావడ్డీ ఇవ్వలేదన్నారు. మహిళలకు సబ్సిడీపై ఏడాదికి 12 వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు కాలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ మూడేళ్లలో టి.నగరపాలెంలో సంక్షేమానికి రూ.13.50 కోట్లు, అభివృద్ధికి రూ.6.20 కోట్లు ఖర్చు చేయడమే కాకుండా వైఎస్సార్ ఆసరా ద్వారా 55 సంఘాలకు రూ.1.53 కోట్లు రుణమాఫీ, రూ.12.05 లక్షలు సున్నా వడ్డీ అందించారన్నారు. అలాగే తాళ్లవలసలో సంక్షేమానికి రూ.26 కోట్లు, అభివృద్ధికి రూ.6.5 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఆసరా ద్వారా పంచాయతీలో మహిళలకు రూ.3.27 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, సర్పంచ్‌లు పొట్నూరు ఛాయాగౌతమి, బోనిల జగ్గమ్మ, సమ్మిడి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, సంగపూర్ బుజ్జిరాజు, మండలపార్టీ అధ్యక్షుడు గాదు శ్రీను, ఎంపీటీపీ పభ్యుడు చెల్లూరి నగేష్, బోనిల సన్నిబాబు, పొట్నూరు చంద్రశేఖర్, చిల్ల హరి, పల్లా సన్యాసిరావు, అక్కరమాని అప్పలనాయుడు, గొలగాని సన్యాసిరావు, దంతులూరి వేణురాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుపై దిశానిర్దేశం

తగరపువలస: సంగివలస అనిల్ ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో శనివారం ప్రముఖ శస్త్రచికిత్సల నిపుణుడు, పుస్తక రచయిత డాక్టర్ రాజగోపాల్ షెనాయ్ అతిథి ఉపన్యాసం చేశారు. విద్యార్థుల మెరుగైన భవిష్యత్తుకు అవసరమైన మెళకువలు, వైద్య వ్యవస్థలో ఇటీవల జరుగుతున్న మార్పుల గురించి వివరించారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, రెసిడెంట్ ప్రొఫెసర్లు, మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ల ఇంటర్వ్యూలకు 106మంది హాజరు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్-2 కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 106మంది హాజరయ్యారని జోనల్ కమిషనర్ కె. కనకమహాలక్ష్మి చెప్పారు. 5 నుంచి 13వరకు గల 9 వార్డుల్లోని 91 వార్డు సచివాలయాల పరిధిలో గల 224 వలంటీర్ పోస్టులకు 3 కౌంటర్ల ద్వారా సర్టిఫికెట్లు పరిశీలించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

తగరపువలస: చిట్టివలసకు చెందిన నాగవంశ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాళ్ల గురునాయుడు మొదటి వర్ధంతి సందర్భంగా వెంకటేశ్వరమెట్టపై గల వేంకటేశ్వరస్వామి, కనకదుర్గాదేవి ఆలయ సముదాయంలో శనివారం భారీ అన్నదానం జరిగింది. కేజీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షుడు కాళ్ల శ్రీనివాసరావు ఈ అన్నదానం చేశారు.

40 మంది రక్తదానం

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న నోవెల్ పేటెంట్ సర్వీసెస్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థకు చెందిన 40 మంది ఉద్యోగులు రక్తదానం చేయగా రోటరీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హిమబిందు, మురళి పట్టాభి, ప్రాజెక్ట్ మేనేజరు ఉదయ్‌తేజ, ఎస్‌విఏఎస్ రాజు, నిడిగట్టు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఎస్‌ఏ ఉద్యోగుల ఆర్‌జేడీకి వినతి

మధురవాడ : ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉద్యోగులు రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో మధురవాడలో ఆర్‌జేడీ జ్యోతికుమారికి తమ సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. ఈ పథకంలో పనిచేస్తున్న మండల విద్యాశాఖ ఆఫీసు, సీఆర్‌పీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, మండల లెవెల్ అకౌంటెంట్, మెసెంజర్స్, సహిత విద్యా రిసోర్స్ పర్సన్‌లు, భవిత ఆయా, ఫిజియోథెరపిస్టుల ఇతర ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తదితర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాని కోరారు. జేఏసీ ప్రతినిధులు ఎమ్‌డీ అబ్దుల్ ఖాదర్, రశిశంకర్, గంగునాయుడు, అప్పారావు తదిరులు ఉన్నారు.

ఏఎస్‌ఏ ఉద్యోగుల నిరసన


ప్లకార్డులతో కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

పద్మనాభం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు శనివారం నుంచి పెన్‌డౌన్‌కు దిగారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె.అప్పలకొండ, బి. గౌరమ్మ, పుష్పలత, సి.హెచ్.బుచ్చిబాబు, జె.రమణ పాల్గొన్నారు.

ఆస్తుల పరిరక్షణకు చర్యలు

భీమునిపట్నం: భీమిలిలోని పోలీస్‌స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో స్టేషన్‌కు సంబంధించిన ఆస్తుల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తోటవీధి ప్రాంతంలో పోలీసు సిబ్బంది క్వార్టర్లు ఉండగా అవి చాలా కాలంగా వినియోగంలో లేక శిథిలమైపోయాయి. అలాగే స్టేషన్‌కు సమీపంలో ఎస్ఐ నివాస క్వార్టర్‌కూడా పాడైపోయింది. అయితే వీటిని కొందరు వీటిని ఆక్రమణలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. దీంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బోర్డులు ఏర్పాటు చేశారు.

అంతర్జాతీయ నైపుణ్యంతో ప్రజలకు వైద్య సేవలు

కొమ్మాది: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవసరమైన అంతర్జాతీయ నైపుణ్యాలను భారతీయ వైద్యులు సాధించాలని గీతం అధ్యక్షుడు ఎం. శ్రీ భరత్ అన్నారు. సొసైటీ ఫర్ హెల్త్ కేర్ సిమ్యులేషన్ ఆధ్వర్యంలో జీఎస్ఎల్ వైద్య కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న 5వ జాతీయ సిమ్యులేషన్ సమావేశాలను ఆయన ప్రారంభించారు. శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడానికి మెడికల్ సిమ్యులేషన్ పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతుందని వైద్యులు దీనిపై పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. ఈ సమావేశానికి దేశం నలుమూలలనుంచి 140 మంది వైద్యులకు పైగా హాజరయ్యారు. సొసైటీ ఫర్ హెల్త్‌కేర్ సిమ్యులేషన్ జాతీయ అధ్యక్షుడు డా. ఎస్. శ్రీరామ చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దాకమర్రిలో ధనుర్మాస ఉత్సవాలు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రిలోని శ్రీదేవి, భూదేవి సహిత శ్రీలక్ష్మీవల్లభనారాయణస్వామి వారి ఆలయంలో ఆదివారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జనవరి 14 వరకు మూడు పూటలా భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదాలు అందించనున్నట్టు ధర్మకర్త సంకురుభుక్త ప్రకాష్ తెలిపారు.

విజయం కోసం కృషి చేయాలి


మాట్లాడుతున్న జేడీ లక్ష్మీనారాయణ

తగరపువలస: ప్రజాస్వామ్యంలో విజయం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీబీఐ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ కోరారు. శనివారం సంతపేటలోని మాజీ సైనికులు, యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. యువతరం ఒకరి ఆలోచనలు మరొకరితో పంచుకోవాలన్నారు. సమాజ సేవకు ప్రతి ఒక్కరు అంకితం కావాలన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి పలకాలంటే ఓటింగ్ శాతం పెరగాలన్నారు. ఫిజికల్ ట్రైనర్, మోటివేటర్ మట్టా అప్పల నరసయ్యరెడ్డి(మ్యాన్ రెడ్డి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు దుర్గా రామకోటి, వెంపాడ శ్రీనివాసరెడ్డి, ఆదిమూలం సత్యనారాయణ, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కె.జి.రెడ్డి, మాజీ సైనికులు మేకల శ్రీను, నీలాపు శివశంకరరెడ్డి, సాడి రమేష్, రాజన్నరెడ్డి, సీటీ రెడ్డి, ఉప్పాడ అప్పలరెడ్డి, సరగడ సూరిబాబు పాల్గొన్నారు.

రీ సర్వేను రైతులు వినియోగించుకోవాలి

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు జరుపుతున్న రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కె.సూర్యారావు కోరారు. మండలంలోని కుసులువాడలో జరుగుతున్న సర్వేను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ సూర్యారావు మాట్లాడుతూ 70 ఏళ్ల తర్వాత సమగ్ర భూ సర్వే జరుగుతోందని వివరించారు. ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగించి సర్వే నిర్వహిస్తున్న దృష్ట్యా పొలాలకు సంబంధించిన కచ్చితమైన కొలతలు వస్తాయన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన హద్దులను చూపించి సర్వే బృందాలకు సహకరించాలన్నారు. ప్రతి మడికి ఒక యూనిక్ నంబరు కేటాయించి దాని కొలతలను పొందుపరుస్తామని వివరించారు. సర్వే ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆన్‌లైన్ చేసి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామన్నారు. ఇక నుంచి రైతు రిజిస్ట్రార్ ఆఫీసులో నేరుగా వేలి ముంద్రలు వేస్తేనే రిజిస్ట్రేషన్ జరుగుతుందని దీని వలన అవకతవకలకు ఆస్కారం ఉండదన్నారు. రైతులు సర్వే అధికారులకు పూర్తి వివరాలు అందించాలని కోరారు. ఆయన వెంట సర్వే విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కనకబాబు, మండల సర్వేయర్ డి.రాజేష్ ఉన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు ప్రారంభం


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న అతిథులు

పీఎంపాలెం: జీవీఎంసీ 6వ వార్డులోని బక్కపాలెంలో ఏపీఎస్‌పీఎఫ్ పోలీస్ శిక్షణా కేంద్రంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లవ్ ఎన్‌కేర్ అంతర్జాతీయ సంస్థ వ్యవస్థాపకులు ఏసుపాదం హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన బైబిల్ వాక్యాలు వినిపించారు. 16 పోలీస్ బెటాలియన్ అడిషన్ కమాండెంట్ పీ. శ్యామ్యూల్ జాన్ , సుధారాణి, పాస్టర్ సతీష్ పాల్, ఏఆర్ ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ


విశ్వజిత్‌కు బ్యాగు అప్పగిస్తున్న పోలీసులు

పీఎంపాలెం: ఆటోలో మరిచిపోయిన విలువైన వస్తువులను ట్రాఫిక్ పోలీసులకు బాధ్యతగా అందజేసి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీ చాటుకున్నాడు. పీఎంపాలెం ట్రాఫిక్ ఎస్ఐ మురళీ కృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. విశ్వజిత్ అనే వ్యక్తి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు రుషికొండ ఆర్ఆర్ఆర్ గ్రాండ్ హోటల్ వద్ద ఆటో ఎక్కి సాగర్‌నగర్‌లో దిగిపోయాడు. రూ.3వేలు, ల్యాప్‌టాప్‌తోపాలు మరి కొన్ని వస్తువులతో ఉన్నబ్యాగు ఆటోలో మర్చిపోయాడు. దీంతో పీఎంపాలెం ట్రాఫిక్ ఎస్ఐ పీ.మురళీకృష్ణకు ఆటో డ్రైవర్ బ్యాగు అందజేశాడు. బాధిత వ్యక్తి వివరాలు సేకరించిన పోలీసులు బ్యాగును అప్పగించారు.

గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థికి అభినందనలు


సాయిచరణను అభినందిస్తున్న శ్రీకృష్ణా విద్యాసంస్థల చైర్మన్ నరసింగరావు

తగరపువలస: ఇటీవల పాండిచ్చేరి ఇందిరాగాంధీ స్పోర్ట్స్ స్టేడియంలో షోటాకాన్ ఇండియన్ కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి బర్ల సాయి చరణ్‌ను చిట్టివలస శ్రీకృష్ణా విద్యాసంస్థల చైర్మన్ బి.నరసింగరావు శనివారం అభినందించారు. ప్రిన్సిపాల్ కె.త్రినాథ్ మాట్లాడుతూ కళాశాల చైర్మన్ ఆర్థిక సాయం చేసి పాండిచ్చేరి పోటీలకు పంపించారన్నారు.